సూర్య కలర్స్
Life is A Rainbow

2లో... వీజేలదే జోరు



ఇన్‌సైడ్...



అంతా ఆనందమే 3లో...

శుక్రవారం 22 మే 2009

features@suryaa.com



చిత్రాంగదాసింగ్

బాలీవుడ్ అనగానే మనకు అందాల భామలు గుర్తుకువస్తారు. బాలీవుడ్‌లో ఎంతోమంది అందమైన హీరోయిన్లు ఉన్నారు. వారిని చూసి ఆనందించాలే కానీ వారిని వేదించడం సరికాదు. కానీ ఈ మధ్య బాలీవుడ్ తారలు తరుచుగా ఈవ్‌టీజింగ్‌కు గురవుతున్నారట. పోకిరిలు చాలామంది వారివెంటపడి వేదిస్తుండడంతో ఏం చేయాలో వారికి తోచడంలేదట. కొంతమంది మాత్రం వారికి మాటలతో, చేతలతో బుద్ది చెబుతున్నప్పటికీ మరికొంతమంది ఏమీ చేయలేక ఊరుకుంటున్నారట. ఈ మధ్యకాలంలో బాలీవుడ్ తారలు కొంత మంది ఈవ్‌టీజింగ్‌కు గురయ్యారు. ఆ సమయంలో వారు ఏం చేశారో ఒకసారి పరిశీలిస్తే...

# తారలకూ...తప్పదా!

# ఈ(వ్)టీజింగ్

**అమిషాపాటేల్:** బాలీవుడ్ భామ అమీషాపాటేల్ ఈ మధ్య ఈవ్ టీజింగ్ భారిన పడిందట. ఒక వ్యక్తి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడట. అయితే ఆమెను ఈవ్‌టీజ్ చేస్తున్న సమయంలో పక్కన ఎవరూ లేకపోవడంతో చాలా ఇబ్బంది పడిందట. ఆ సమయంలో ఆమె వ్యక్తిగత భద్రత సిబ్బంది కూడా వెంట లేకపోవడంతో ఆ ఈవ్ టీజర్ మరింతగా రెచ్చిపోయాడట. ఆ తరువాత తన భద్రతా సిబ్బందితో ఆ ఈవ్‌టీజర్‌ను వెతికించినా లాభం లేకుండా పోయిందట.

**నీతుచంద్ర:** బాలీవుడ్ తార నీతుచంద్ర కూడా అలాంటి సమస్యనే ఎదుర్కొందట. ఒక సమయంలో ఈవ్‌టీజర్ తన వెంటపడి వేధిస్తున్నాడట. దీంతో విసుగెత్తిన నీతు అతని ముఖం మీద ఒక్కటిచ్చిందట. 'ఆ సమయంలో నాకు వాడిని ఏమీ అడగాలనిపించలేదు. కేవలం వాడి అంతుచూడలనిపించింది. వాస్తవానికి నేను ప్రతివిషయాన్నీ చాలా తేలికగా తీసుకుంటాను. కానీ ఈ విషయంలో ఎందుకో అలా చేయాలనిపించలేదు. అంతే వాడికి కనపడితే ఒట్టు' అని నీతు ఆనందంతో చెప్పుకుంది.



అమిషాపాటేల్

**కల్కి కోచిలిన్:** 'నేను చాలా కాలం ఈ సమస్యను ఎదు ర్కున్నాను. నిజంగా నాకవి చాలా చెడ్డ రోజులు. అటువంటి వారికి మనం మంచి మాటలు ఎన్ని చెప్పినా దారికిరారు. అటు వంటి వాళ్లకు బుద్ధి రావాలంటే ప్రత్యేకంగా ఈవ్‌టీజింగ్ చట్టం తీసుకురావాలి.

**ఇషాకోపికర్:** 'నేను వ్యక్తిగతంగా మార్షల్‌ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నాను. అయితే ఏ సందర్భంలోనూ దాన్ని వినియోగించాలని అనుకోలేదు. ఈవ్‌టీజింగ్ సమస్యను ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు. తైక్వాండోలో నాకు రెడ్‌బెల్ట్ ఉంది. త్వరలోనే బ్లాక్‌బెల్ట్ తీసుకుంటున్నాను. కనుక ఈవ్‌టీజర్స్ ఎవరైనా ఉంటే తమ పద్ధతి మార్చుకుంటే మంచిది.'

**చిత్రాంగదాసింగ్:** ఈవ్‌టీజింగ్ విషయంలో నేను చాలా గ్రేట్ అని చెబుతాను. ఎందుకంటే నన్నెవరైనా వేధిస్తే వెంటనే వారికి బుద్ది వచ్చేలా సమాధానం చెబుతాను. ముఖం మీదే మాట్లాడతాను. చుట్టూ ఎవరున్నారని కూడా చూసుకోను. ఆ తరువాత ఏం జరిగినా ఫరవాలేదు అనుకుంటానే కానీ బయపడను. ఈ విషయంలో నేను చాలా జాగ్రత్తగా ఉండడానికి ప్రయత్నిస్తాను. వాస్తవానికి ఈవ్‌టీజింగ్ సమయంలో మనం వెంటనే రియాక్ట్ కాకుంటే వారు మరింత రెచ్చిపోతారనే విషయాన్ని గుర్తించాలి.

**కోయినా మిత్రా:** ఈ విషయానికి నేను అంతగా ప్రాధాన్యత ఇవ్వను. వాస్తవానికి మనం చూసే దృష్టిని బట్టి ఈవ్‌టీజర్స్ ప్రవర్తన ఉంటుంది. ఈవ్‌టీజర్లకు నేను మంచిగా మారమని ప్రత్యేకంగా క్లాసులు చెప్పాలని అనుకోవడం లేదు.

**ఈవ్యాదత్తా:** నేను పంజాబ్‌లో చాలా మంది ఈవ్‌టీజర్లకు తగిన బుద్ది చెప్పాను. నా గురించి తెలిసిన వారెవ్వరూ నన్ను ఈవ్‌టీజింగ్ చేయడానికి ధైర్యం చేయలేదంటే నేను ఎంత కఠినంగా ఉండేదాన్నో అర్ధం చేసుకోవచ్చు.

**మినిషాలంబా:** నేను చాలాసార్లు ఈవ్‌టీజింగ్‌ను ఎదుర్కున్నాను. అయితే మరీ పెద్ద ఎత్తున మాత్రం కాదు. నేనయితే అటువంటి ఈవ్‌టీజర్లకు దేవుడు మంచి గుణాన్ని కలిగించాలని వేడుకుంటాను.

**సోఫియాచౌదరి:** నిజానికి చొప్పొద్దుకానీ ఒక సమయంలో నేను ఈవ్‌టీజింగ్‌ను ఎదుర్కుంటున్న సమయంలో నా సెక్యూరిటీ గార్డు వెంట ఉండి కూడా దానినుండి నన్ను కాపాడలేక పోయాడు. వాస్తవానికి నేను ఈవ్‌టీజింగ్‌కు గురయిన ప్రాంతం మారు మూల ప్రాంతం కావడం కూడా ఒక కారణం. అప్పటినుండి నాతో ఎవరై నా చెడుగా ప్రవర్తిస్తే సహించను. వెంటనే తగిన విధంగా బుద్ది చెప్పడానికి ప్రయత్నిస్తాను. ఈవ్‌టీజర్లకు బుద్ది చెప్పడానికి పెద్ద గ్యాంగు ను పెట్టుకోవలసిన అవసరం అసలే లేదు. నాతో పాటు ఒకరు ఉంటే చాలు నేను క్షేమంగా ఉంటానని అనుకుంటాను.




కల్కి కోచిలిన్

అర్ధరాత్రి ఆడది ఒంటరిగా వీధుల్లో నడిచినపుడే నిజమైన స్వాతంత్రం వచ్చినట్లని పెద్దలు ఎపుడో అన్నారు. వాస్తవానికి నేడున్న పరిస్థితులు పగటిపూట కూడా మహిళలు రోడ్డుమీద నడిచే పరిస్థితి కనిపించడం లేదు. ఇపుడు మన సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్య ఈవ్‌టీజింగ్. అయితే ఈ టీజింగ్ సెలబ్రీటీలుగా ముద్రపడిన బాలీవుడ్ తారలకు కూడా తప్పకపోవడం విడ్డూరంగా అనిపించినా ఇది మన సమాజం జీర్ణించుకోలేని నిజం మరి.



కోయినా మిత్రా



రవిశంకర్

# డబ్బింగ్ కింగ్

రవిశంకర్... అంతగా పరిచయంలేని పేరు కానీ ఒకసారి అతని బ్యాక్‌గ్రౌండ్ తెలుసుకుంటే సగటు తెలుగు ప్రేక్షకుడు ముక్కున వేలేసుకోవాల్సిందే. తన 22 సంవత్సరాల కెరీర్‌లో దాదాపు 2600 చిత్రాలకు (తెలుగు, తమిళం, కన్నడ, మళయాళం) డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా పనిచేసిన రవిశంకర్ మరెవరో కాదు, డైలాగ్ కింగ్ సాయికుమార్‌కి స్వయానా సోదరుడు. ప్రఖ్యాత డబ్బింగ్ ఆర్టిస్ట్, నటుడు పి.జె.శర్మ కుమారుడు. ఈమధ్యనే విడుదలై సంచలనం సృష్టిం చిన 'అరుంధతి' చిత్రంలో 'నన్ను చంపి సమాధిలో కుళ్ళబెట్టిన నిన్ను వదల బొమ్మాళీ.. వదల..' అనే డైలాగ్ ఎంత పాపులర్ అయిందో అందరికీ తెలిసిందే. ఆ చిత్రంలో పశుపతి (సోనూసూద్) పాత్రకు డబ్బింగ్ చెప్పింది రవిశంకరే. ఒక రకంగా చెప్పాలంటే ఆ చిత్రం విజయం సాధించటానికి ప్రధాన కారణం రవిశంకర్ గాత్రమనే చెప్పాలి. డబ్బింగ్ విభాగంలో నేషనల్ అవార్డ్ ప్రవేశపెట్టాలంటున్న రవిశంకర్ గురించి కాసేపు...

**నటుడిగా తెరంగేట్రం:** తన తండ్రి పి.జె.శర్మ, నటుడిగానే కాక డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా శివాజీ గణేషన్‌లాంటి ఎందరో మహానటులకు గాత్రదానం చేసి ఆ పాత్రలకు జీవం పోశాడు. డా.రాజశేఖర్, సుమన్, రజనీకాంత్‌వంటి ప్రముఖ నటులకు డబ్బింగ్ చెప్పి, తదనంతరం హీరోగా మారిన తన సోదరుడు సాయికుమార్ మనందరికీ సుపరిచితమే. వారిదారిలోనే తన సినీ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నాడు రవిశంకర్. 1986లో ఆర్.నారాయణమూర్తి తీసిన 'ఆలోచించండి' చిత్రం ద్వారా హీరోగా పరిచయమై తరువాత మధురానగరిలో, కీచురాళ్ళు వంటి చిత్రాల్లో నటించనా అవి అంతగా పేరుతెచ్చిపెట్టలేదు. తరువాత గోపిచంద్ నటించిన 'తొలివలపు' చిత్రంతో విలన్‌గా పునః ప్రవేశం చేసినా అది కూడా బాక్సాఫీస్ వద్ద బొల్తా కొట్టింది. ఇక లాభం లేదనుకొని డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా రీఎంట్రీ చేసిన రవిశంకర్ తన సత్తా చాటుకుంటున్నాడు.

**బహుముఖ ప్రజ్ఞాశాలి:** ఎందరో హీరోలకు, విలన్లకు తన డబ్బింగ్‌తో వారి పాత్రలకు జీవంపోసిన రవిశంకర్ 'రౌడీయిజం జిందాబాద్' చిత్రంలో మోహన్‌రాజ్ పాత్రకు డబ్బింగ్ చెప్పడం ద్వారా తన కెరీర్‌కు శ్రీకారం చుట్టాడు. రఘువరన్, మోహన్‌రాజ్, దేవరాజ్, చరణ్‌రాజ్, కెప్టెన్‌రాజ్, అమ్రీష్ పురి, నాజర్, ప్రకాష్‌రాజ్ (హిట్లర్ చిత్రం వరకు), సోనూసూద్, ప్రదీప్ రావత్, ముఖేశ్ రిషి, ఆశిష్ విధ్యార్థి, అశుతోష్ రాణా వంటి విలన్‌లకు రవిశంకరే స్పెషలిస్ట్ డబ్బింగ్ ఆర్టిస్ట్. తెలుగులో నటిస్తున్న పరభాషా నటులు చాలామందికి డబ్బింగ్ చెప్పేది రవిశంకరే అంటే అతిశయోక్తి కాదు. అంతేకాదు ఒకే చిత్రంలో ఏకంగా ఐదు పాత్రలకు డబ్బింగ్ చెప్పిన ఘనత రవిశంకర్‌ది. రాజ్‌కుమార్ సంతోషి హిందీ సినిమా 'చైనాగేట్' తెలుగు వెర్షన్‌లో డానీ, అమ్రీష్ పురి, ఓంపురి, నసీరుద్దీన్ షా, పరేష్ రావల్ పాత్రలకు డబ్బింగ్ చెప్పాడు. ఒకే సీన్‌లో నటించిన ఐదు క్యారెక్టర్లకు డబ్బింగ్ చెప్పినా ప్రేక్షకులు గుర్తించకపోవడం విశేషమేమరి!. రవిశంకర్ డబ్బింగ్ ఆర్టిస్టే కాదు డైలాగ్ రైటర్, దర్శకుడు కూడా. దాదాపు రెండువందల చిత్రాలకు పైగా డైలాగ్స్ రాసాడు. రవిశంకర్ డైలాగ్స్ రాసిన ఎన్నో సినిమాలు బాక్సాఫీస్ హిట్లే. అంతేకాదు పలు చిత్రాలకు దర్శకత్వం కూడా వహించాడు. ఈయన దర్శకత్వంలో వచ్చిన కన్నడ చిత్రం 'దుర్గి' సూపర్ హిట్టయింది. ఇతనికి తెలుగు, తమిళం, కన్నడం, మళయాళం భాషలతో పాటు చాలా భాషల్లో ప్రవేశం ఉంది. అరుంధతి చిత్రంలో పశుపతి పాత్ర కనిపించేది 20% మాత్రమే కాని 80% సినిమాలో అతని డైలాగ్స్ వినిపిస్తూనే ఉంటాయి, అంటే నటనకంటే డైలాగ్స్‌తోనే ఆ పాత్ర ఎక్కువగా పాపులరయిందని చెప్పవచ్చు. ఈ క్రెడిట్ అంతా రవిశంకర్‌కే దక్కుతుంది.

**అవార్డుల పంట:** తన తండ్రి వారసత్వ సంపదగా సంక్రమించిన గాత్రానికి సాయికుమార్ ఒక గమ్యాన్ని నిర్దేశిస్తే, దాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చాడు రవిశంకర్. ఇప్పుడు తెలుగు చిత్రసీమలో రవిశంకర్‌ను మించిన డబ్బింగ్ స్టార్ లేడు. శంకర్‌దాదా ఎమ్‌బిబిఎస్, ఇంద్ర, ఒకే ఒక్కడు, విక్రమార్కుడు, ఆజాద్, అతడు, పోకిరి, సై, సింహాద్రి లాంటి ఎన్నో చిత్రాలు డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా తనకు మైలురాళ్ళు. ఇందులో పోకిరి (నాజర్, ఆశిష్ విధ్యార్థి), ఇంద్ర (ముఖేష్ రిషి), సై (ప్రదీప్ రావత్) లాంటి చిత్రాలకు నంది అవార్డులను సొంతం చేసుకున్న రవిశంకర్ అతిథి చిత్రంలో మురళీ శర్మ (విలన్) పాత్రకు డబ్బింగ్ చెప్పడం ద్వారా ఐదవసారి ఈ అవార్డును తన ఖాతాలో వేసుకున్నాడు.

డబ్బింగ్ ఆర్టిస్ట్‌లకు బాలీవుడ్ నటులు ఇచ్చినంత గౌరవం మన దక్షిణాది నటులు ఇవ్వరట. 'ఒకే ఒక్కడు' చిత్రంలో రఘువరన్ పాత్ర డబ్బింగ్‌తోనే పాపులరయిన విషయం మనందరికీ తెలిసిందే, కాని రఘువరన్ కనీసం ఫోన్‌లో కూడా విష్ చేయలేదట. అదే 'అస్త్రం' చిత్రంలో జాకీష్రాఫ్‌కు డబ్బింగ్ చెబితే అతను ఇంటికి వచ్చి ప్రత్యేకంగా అభినందించటమే కాకుండా డిన్నర్ కూడా చేసివెళ్ళాడట.

తమిళం నుండి తెలుగులోకి అనువదిస్తున్న సూపర్ హిట్ మూవీ 'పొల్లదవన్' చిత్రంలో విలన్ గా చేస్తున్నాడట రవిశంకర్ (ఇందులో వరుణ్ సందేశ్ హీరోగా నటిస్తున్నాడు). రవిశంకర్ సినీ ప్రస్థానం ఆరు డైలాగ్‌లు మూడు అవార్డులతో అప్రతిహతంగా కొనసాగాలని ఆశిద్దాం.

# అమెరికాలో తెలుగు సంబరాలు

'ఉద్యోగం కోసం విదేశాల్లో స్థిరపడిన ప్రవాస భారతీయులకు ఆ సంస్థ తమకు చేతనైనంతలో సహాయం అందిస్తోంది. ఎలాంటి సమస్య వచ్చినా మీకు మేము అండగా ఉన్నామంటూ ఇతోధికంగా చేయూతనిస్తోంది..ఇమ్మిగ్రేషన్‌తో పాటు ఉపాధి..వరకట్న, గృహవేధింపులు, వైద్య, న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తోంది. స్థానికంగా ఉన్న తెలుగువారికి అవసరమైన సేవలను సేవాధృక్పధంతో అందించేందుకు నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) మూడు నెలల క్రితం ఏర్పాటైంది. నార్త్ అమెరికాలో ఉంటున్న ఏడులక్షల మంది తెలుగువారికి ఆ సంస్థ అండగా నిలుస్తోంది. జులై 2నుంచి తొలి సమావేశాలను నిర్వహిస్తున్న సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షులు డాక్టర్ నాదెళ్ల రాణాకుమార్ గురువారం హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన 'సూర్య' ప్రతినిధితో ముచ్చటించారు.

**★ ఏ ఉద్దేశ్యంతో ఈ సంస్థను ఏర్పాటు చేశారు ?**

-ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవే పరమార్థంగా అమెరికాలోని ప్రవాసాంధ్రుల ప్రతిభను ప్రోత్సహించేందుకు అండగా నిలిచేందుకు నార్త్ అమెరికా తెలుగు సొసైటీని నెలకొల్పాం. రాజకీయ పార్టీతో సంబంధంలేని ఏకైక సంస్థ ఇది.

**★ ఇప్పటివరకు మీరు ఎలాంటి సేవలు అందించారు ?**

- విదేశాల్లో ఉంటున్న తెలుగువారు ఎదుర్కొంటున్న అన్ని ఇబ్బందులు, సమస్యలపై వెంటనే స్పందిస్తున్నాం. ఇటీవల సెయింట్ లూయిస్‌లో నలుగురు విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సమయంలో వారి మృతదేహాలను హైదరాబాద్ పంపేందుకు ఇతోధికంగా సహాయపడ్డాం. చికాగోలో ఓ అపార్ట్‌మెంట్ తగులబడిన సంఘటనలో విద్యార్థుల పాస్‌పోర్టులు, లాప్‌టాప్స్ అగ్నికి ఆహుతైతే వారికి కొంత నగదు సహాయం అందించాం.

**★ నాట్స్ తరపున ఇంకా ఏం చేస్తున్నారు ?**

- అమెరికాలోని ప్రతి సిటీలో పెద్ద టీమ్‌లను ఏర్పాటు చేశాం. అన్ని సమస్యలను తీర్చలేకపోయినా కొంతమేర ఆర్థిక ఇబ్బందులను పరిష్కరిస్తున్నాం. తెలుగువారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించడమే ప్రధాన ఉద్దేశ్యం.

**★ తొలి సమావేశాలు ఎక్కడ నిర్వహిస్తున్నారు ?**

-జులై 2 నుంచి మూడు రోజుల పాటు ఫ్లోరిడాలోని ఆర్లాండో ఆరంజ్ కౌంటీ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ సమావేశాలను నిర్వహిస్తున్నాం. 'అమెరికా తెలుగు సంబరాలు' పేరిట మునుపెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాం. తెలుగు సంబరాల సందర్భంగా ఈనెల 23న తాజ్‌దక్కన్ లాన్స్‌లో ప్రత్యేక సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి సినీనటులు అల్లు అర్జున్, రామ్‌చరణ్‌తేజ తదితరులు హాజరవుతున్నారు.

**★ తెలుగు సంబరాల ప్రత్యేకత ఏమిటి ?**

-తెలుగువారి కుటుంబాల్లో ఆనందం నింపేలా ఈ సంబరాలను నిర్వహిస్తున్నాం. ప్రత్యేక సంగీత విభావరి, జానపద సంప్రదాయ నృత్యాల సమ్మేళనం, తెలుగు గజల్స్, మిమిక్రీ, తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నాం. వేదిక ప్రాంగణంలో జ్యుయలరీ, టెక్స్‌టైల్స్ (ఇండియన్ డ్రస్సెస్), హ్యాండీక్రాఫ్ట్స్, మ్యూజిక్ సీడీలు, డీవీడీలతో స్టాల్స్‌ను అందుబాటులో ఉంచుతున్నాం.

**★ఎవరెవరు హాజరవుతున్నారు ?**

-మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుతో పాటు ప్రధాన ఆకర్షణగా జూనియర్ ఎన్టీఆర్, హీరో శ్రీకాంత్, ఆలీ, ఆహుతీప్రసాద్, హీరోయిన్లు కాజల్, శియ, నమిత, నిఖిత, సంజన, సాయికుమార్, తనికెళ్ల భరణి తదితరులు వస్తున్నారు.

**-ఇస్కా రాజేష్‌బాబు**
**ఫొటోలు : దాచేపల్లి ఆనంద్**




రాణాకుమార్